


జవహర్ నవోదయ ప్రవేశాలకు
దరఖాస్తు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వతరగతి ప్రవేశ దరఖాస్తు గడువు ఈ నెల 26వతేదీ వరకు పొడిగించినట్లు జవహర్ నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చందిరన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



- ఎండీయూ వాహనాల బరితెగింపు
- జిల్లాలో పెట్రేగిపోతున్న రేషన్ మాఫియా
- పేదలకు చిల్లర.. అక్రమార్కులకు కోట్ల ఆదాయం
- పేదలకు కిలో బియ్యం రూ.10తో ఎర
- గుట్టుచప్పుడు కాకుండా మిల్లర్ల మాయాజాలం

బియ్యం బ్లాక్ మార్కెట్‌కు..!

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. జిల్లాలో చౌక దుకాణాలు 1233, ఎండీయూ వాహనాలు 409, తెల్లరేషన్‌కార్డులు 6,76,209 ఉన్నాయి. ప్రతి ఎండీయూ వాహనానికి నెలకు రూ.21వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు అందిస్తోంది. పేదలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, ఇతర నిత్యావసరాలు తెచ్చుకోవడం కష్టమవుతుందంటూ గత వైసీపీ ప్రభుత్వం భారీ ఖర్చుతో ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని ఇంటింటికి తీసుకువెళ్లి అందిస్తున్నట్లు జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకుంది. అంతా అది నిజమేనని ప్రజలు సంతోషపడ్డారు. కానీ ఆ వాహనాలు ఆ వీదిలో ఏదో ఒక చివర ఆపేసి సైరన్ కొడితే లబ్ధిదారులే సంచులు, రేషన్ కార్డులు చేతపట్టుకుని వాహనాల దగ్గరకి పరుగులు పెట్టాల్సిన పరిస్తితి నెలకొంది. ఆ సమయంలో ఎవరైనా ఇంట్లో లేకుంటే వారికి బియ్యం ఆ నెలకు అందే పరిస్థితి లేదు. వాహనం దగ్గరకు వచ్చిన కొంత మంది లబ్ధిదారులకు ఇచ్చామని అనిపించి మిగిలిన వాటిని నేరుగా నల్లబజారుకు తరలిస్తున్నారు.



నిల్వగా ఉన్న రేషన్ బియ్యం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 20వ తేదీ లోపు తెల్లరేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున కుటుంబ సభ్యులు ఎంత మంది ఉంటే అంత బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. రేషన్‌కార్డుదారులకు కిలో రూ.10 చొప్పున డబ్బులు ఎర వేస్తున్నారు రేషన్ అక్రమార్కులు. లబ్ధిదారుల దగ్గర బియ్యాన్ని కిలో రూ.10 నుంచి రూ.15లు కొని వాటిని పాలిష్ పట్టించి కిలో రూ.25 నుంచి రూ.30లకు వ్యాపారులకు అమ్ముతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండీయూ వాహనాలు వచ్చాక రేషన్ బియ్యం తరలింపు తేలికవడంతో 60శాతం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. కిలో బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.55 వరకు ధర పలుకుతోంది. సాధారణ రకం బియ్యం అయితే రూ.35 నుంచి 40 వరకు ఉంది.

రైస్ మిల్లర్ల కీలక పాత్ర

రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాలు కీలకం. గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలు ప్రవేశ పెట్టడానికి ముందు రేషన్ దుకాణాలు ఇళ్ల మధ్య ఉండడం, వాటి దగ్గరకు సరుకులు దింపే లారీలు మినహా మరి ఇతర వాహనం వచ్చినా రేషన్ సరుకులు నల్లబజారుకు తరలిస్తున్నారని ఇట్టే పసిగట్టి చుట్టుపక్కల వారు అధికారులకు సమాచారం అందించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఏ అడ్డంకులు లేకుండా అధికారికంగానే రేషన్ బియ్యం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అక్రమార్కులు, అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బియ్యం, అక్రమ రవాణాలో కొందరు మిల్లర్లే క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

మిగతా 7లో..

ట్రేడ్ లైసెన్సు బకాయిలు

- వసూళ్లలో నిర్లక్ష్యం..
- పట్టించుకోని అధికారులు



నగర పాలక సంస్థ కార్యాలయం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శుల నిర్లక్ష్యం వల్ల ట్రేడ్ లైసెన్సుల బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. దీని వల్ల నగర పాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. పైగా కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాలకు లైసెన్సులు ఇవ్వకుండా కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు అందినకాడికి దోచుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. నగరంలో వేల సంఖ్యలో దుకాణాలు ఉంటే లైసెన్సులు తీసుకున్న దుకాణాల సంఖ్య చాలా తక్కువగా ఉంది. గతంలో లైసెన్సు తీసుకున్న వారు ఆ తర్వాత రెన్యువల్ చేసుకోవడం లేదు.

మిగతా 6లో..

ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్‌కు బస్సు సౌకర్యం

ఆర్టీసీ డిపో మేనేజర్

కర్నూలు రూరల్ నవంబరు19(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం కర్నూలు నుంచి ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్‌కు పల్లెవెలుగు బస్సును నడపనున్నట్లు ఆర్టీసీ కర్నూలు-1డిపో మేనేజరు కె. సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు కర్నూలు నుంచి ఉదయం 8-45 గంటలకు బయలుదేరి 9-30 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందన్నారు. తిరిగి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 12గంటలకు బయలుదేరి 12-45 గంటలకు, అలాగే కర్నూలు బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 1-15గంటలకు బయలుదేరి 2గంటలకు, ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి సాయంత్రం 4గంటలకు బయలుదేరి 4-45గంటలకు కర్నూలు బస్టాండ్‌కు చేరుకుంటాయని తెలిపారు. చార్జి రూ.30 అని ఆమె వివరించారు.

మల్లన్న హుండీ ఆదాయం
రూ.4.14 కోట్లు



మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీశైలం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా రూ.4,14,15,623 నగదు రాబడిగా లభించింది. ఈ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 26 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 32.230 తులాల బంగారు, 8.5 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 739 యూఎస్ఏ డాలర్లు, 135 ఆస్ట్రేలియా డాలర్లు, 50 యూఏఈ దిర్హమ్స్, 100 కెనడా డాలర్లు, 205 సింగపూర్ డాలర్లు, 200 ఘనా సీడిస్, 1000 ఉగాండా షిల్లింగ్స్, 1020 మెక్సికో పిసో మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త: ఎస్పీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లలో వచ్చే వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయవద్దని ఎస్పీ బిందుమాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప కూడలిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలతో పాటు విద్యార్థులు భారీ ఎత్తున హాజరయ్యారు. ముందుగా ఓంశాంతి సర్కిల్ వద్ద ఎస్పీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.11 కోట్ల మేర సైబర్ క్రైమ్ జరిగిందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు వి.శ్రీనివాసులు, విక్రమ్‌సింహ, గంగాధర్, ప్రసాద్, అబ్దుల్ గౌస్, ఎస్ఐలు డాక్టర్ నాయక్, శ్రీనివాసులు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించుకుని ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని కలెక్టర్ పి. రంజిత్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మన మరుగుదొడ్డి.. మన గౌరవం' కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్పంచులు సవాలుగా తీసుకుని గ్రామాల్లో అన్ని ఇళ్లకు మరుగుదొడ్ల నిర్మాణాలకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 5,284 మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు ఉత్తర్వులు ఇచ్చామని, వాటిని డిసెంబరు 10లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మరో 12,481 మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరలో చేపడతామని అన్నారు. అనంతరం పసుపల సర్పంచ్ శీలమ్మ, తడకనపల్లి సర్పంచ్ షేకూన్‌బీ, పసుపుల గ్రామ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎస్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

వరి రైతు దగా

వరి రైతుకు ఫలితం దక్కడం లేదు. ధరలు ఘోరంగా పడిపోయాయి. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు దగా పడుతున్నారు. తక్కువ ధరకు అమ్ముకొని నష్టాల పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

- ఆందోళనలో రైతులు ..
- గిట్టుబాటు కాని వ్యవసాయం
- జిల్లాలో 1,63,284 ఎకరాల్లో వరి పంట సాగు
- బస్తాకు రూ.450 రేటు తగ్గడంతో..
- జిల్లాలో వరి రైతుకు 279.21 కోట్ల నష్టం

బనగానపల్లె/ రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 66 వేల హెక్టార్లకు పైగా వరిపంటను ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 28.930 హెక్టార్లలో వరిపంట సాగు చేశారు బనగానపల్లె మండలంలో 9వేల హెక్టార్లలో, అవుకు మండలంలో 12వేల హెక్టార్లలో, కోవెలకుంట్ల మండలంలో 3700 హెక్టార్లలో, సంజామల మండలంలో 3430 హెక్టార్లలో, కొలిమిగుండ్ల మండలంలో 800 హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు.

గిట్టుబాటు ధర ఏది?

రైతులు వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని బెంబేలెత్తిపోతున్నారు. ఒక్కో ఎకరాకు సుమారు కౌలు, ఎరువులు, పురుగుమందులు, కలుపు కూలీలు, వరి నాటు కూలీలు. సేద్యపు ఖర్చులు కలుపుకొని



వరి ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

రూ.50వేలు పెట్టుబడి పెట్టారు. దిగుబడి చూస్తే 38బస్తాలే వచ్చాయి. కానీ రేటు 77 కేజీల బస్తా రూ.1550 పలికింది. గిట్టుబాటు ధర లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే వ్యవసాయానికి స్వస్తి పలకాల్సిందే అని వాపోయారు.

గత ఏడాది 77 కేజీల వరి ధాన్యం బస్తా రూ.2వేలు

గత ఏడాది వరి ధాన్యం 77 కేజీల బస్తా రూ.2వేలకు అమ్మినట్లు రైతులు తెలిపారు. కానీ ఈసారి రూ.1550 వరి ధాన్యం బస్తా రేటు పలికింది. ఒక్కో బస్తాపై రూ.450 నష్టపోవాల్సి వచ్చింది. రైతు కష్టం నేలపాలైందే తప్ప ఈ సారి గిట్టుబాటు ధర కల్పించడంలో నష్టపోవాల్సివచ్చిందని రైతులు వాపోయారు.



వరిపంటను కోస్తున్న యంత్రం

జిల్లాలో వరి రైతుకు రూ.279.21 కోట్లు నష్టం

జిల్లాలో ఎకరాకు 38బస్తాలు దిగుబడి వస్తుంది. కానీ ఒక బస్తాకు రూ.450 రేటు తగ్గింది. గత ఏడాది ఒక బస్తా వరి ధాన్యం రూ.2వేలు రేటు పలికింది. ఈసారి బస్తా ధాన్యం రూ.1550 రేటు పలుకుతుంది. జిల్లాలో 1,63,285 ఎకరాల్లో 38బస్తాలు సగటున 62,04,792 బస్తాల దిగుబడి అంచనా. ఒక బస్తాకు రూ.450 చొప్పున రూ.62,04,792 బస్తాలకు నష్టం రూ.279.21,56,400 ఈసారి ఖరీఫ్ రైతులకు వరిధాన్యంపై నష్టపోయారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు: ఇటీవల వ్యవసాయ కూలీలు, రసాయన ఎరువులు, సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. హెక్టారుకు సుమారు రూ.50వేల వరకు ఖర్చు వస్తోంది. కౌలు రైతులకు మరో రూ.35 వేలు అధికం అవుతోంది. సేద్యపు ఖర్చులు, రసాయనిక ఎరువులు, పురుగుల మందులు ధరలు విపరీతంగా పెరిగాయి. కూలీలు సమయానికి దొరకకపోవడంతో రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వాటితోపాటు అకాల వర్షాలు రైతులను వెంటాడుతూ వచ్చాయి. పంట అమ్మేంత వరకు రైతులు వడ్లను ఆరబోసి వ్యాపారులకు అమ్మే వరకు, లేదా గోదాములకు తరలించేంత వరకు భయం భయంగా రైతులు కాలం వెళ్లదీస్తున్నారు.

మిగతా 6లో..

పెద్దాసుపత్రిలో రెండో ఎగ్జిట్ గేట్


కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు



హెచ్‌వోడీల సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో రెండో ఎగ్జిట్ గేట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు వెల్లడించారు. 3 నెలల తర్వాత ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సూపరింటెండెంట్ తొలి సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులు వారి సహాయకుల రద్దీ విపరీతంగా పెరిగిందని, దీని నివారణ కోసం గైనిక్, పీడియాట్రిక్ విభాగాల్లో విజిటర్ పాసులు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. శ్రీరాములు, డా. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డా. రేణుకాదేవి, సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా. హేమనళిని, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

బాల్యానికి.. బలమైన శక్తి...!



- హక్కులతో ఆకాంక్షను నేరవేర్చుకునే మార్గం
- జిల్లాలో 70వేల మందికిపైగా బాలకార్మికులు
- సక్రమంగా అమలుకు నోచుకొని హక్కులు
- నేడు ప్రపంచ బాలల హక్కుల సంరక్షణ దినం..

ఆత్మకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలకార్మికుల్లో రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమస్థానంలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రోజుకు 6గంటలు పనిచేసే 6నుంచి14ఏళ్ల మధ్య ఉన్న బాల కార్మికులు సుమారు 70వేల మంది వరకు ఉన్నారు. అలాగే మరో 30వేల మందికి పైగా బడిబయట పిల్లలుగా ఉన్నారు. కాగా జిల్లా పరిధిలో ఎమ్మిగనూరు మండలం బాలకార్మికులు ఎక్కువ ఉన్న మండలంగా గుర్తింపు వుంటే ఆ తర్వాతి స్థానాలను నందవరం, హొళగుంద, కోసిగి, గోనెగండ్ల, దేవనకొండ, పెద్దకడబూరు మండలాలు ఉన్నట్లు జిల్లా అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. కోసిగి మండలంలో అత్యల్పంగా అక్షరాస్యతశాతం నమోదు కావడం గమనార్హం. ప్రత్యేకించి గిరిజన చిన్నారులకు కనీస విద్య కూడా అందడం లేదు. నేటికి గూడేలకు పరిమితమై అటవీ ఉత్పత్తుల సేకరణే జీవితగమ్యంగా ముందుకెళ్తున్నారు.

మంచి, చెడులను పూర్తిగా అర్థం చేసుకో లేని బాలలకు హక్కులేంటి? అనుకుంటున్నారా..? కానీ సమాజంలో బలహీనులూ, దోపిడీకి గురయ్యే వారిలో పిల్లలు ఉన్నారు. పిల్లలను దోచుకునే పెద్దలున్న చోట చిన్నారులకు హక్కులుండటం తప్పనిసరి. బాల్యానికి బలమైన శక్తిని చేకూర్చలన్న సంకల్పంతో ఐక్యరాజ్యసమితి పిల్లల హక్కుల కోసం ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. చైల్డ్‌రైట్స్ కన్వెన్షన్ (సీఆర్‌సీ)గా పేర్కొనే ఈ ఒప్పందం గురించి ప్రపంచంలోని మెజార్టీ దేశాలు ఒకతాటిపైకి వచ్చాయి. ముందుగా బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి 1959లో ప్రకటన చేసింది. 1979వ సంవత్సరాన్ని అంతర్జాతీయ బాలల హక్కుల సంవత్సరంగా ప్రకటించింది. 1989 నవంబరులో బాలల హక్కుల పరిరక్షణపై సమావేశం నిర్వహించి ఆమోదించింది. 1990 సెప్టెంబరులో బాలల అభ్యున్నతి కోసం ఐక్యరాజ్యసమితి ప్రపంచసదస్సు నిర్వహించింది. 1992లో చైల్డ్‌రైట్స్ కన్వెన్షన్‌పై భారత్ కూడా సంతకం చేసింది.



బాలల హక్కులు ఇవీ..

18 సంవత్సరాలలోపు బాలలందరికి భారత రాజ్యాంగం పలు హక్కులను కల్పించింది. సమానత్వం, కులం, మతం, జాతి, భాష, ఆడ, మగ, పుట్టుక ప్రదేశం వంటి ఏ విధమైన వివక్షను చూపకూడదు. బిడ్డ పుట్టగానే పేరు, జాతీయత కలిగి ఉండటం, తల్లిదండ్రులతో కలిసి జీవించడం బాలల హక్కు. బాలలను అక్రమంగా రవాణా చేయడం, వ్యభిచార వృత్తిలో దించడం, జీతాలకు పెట్టడం నేరం. అలాగే బాలలు వారి అభిప్రాయాలను పాటలు, బొమ్మలు, ఆటలు, రచనల ద్వారా వ్యక్తం చేయవచ్చు. తల్లిదండ్రులు ఇద్దరూ పనుల్లోకి వెళ్లినట్లయితే ఆ బాలల బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. పిల్లలను ఎవరైనా హింసించినా, దౌర్జన్యం చేసినా, వేధించినా నేరమే. మానసికంగా, శారీరకంగా వికలాంగులైన వారి వృద్ధికి వారిలో ఆత్మవిశ్వాసం పెంపుదలకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రమాదకరమైన పనులు, గనుల్లో, ప్రేలుడు పదార్థాల తయారీలో, హోటళ్లలో బాలల్ని పనిలో ఉంచకూడదు. మాదకద్రవ్యాల నుంచి బాలలను దూరం చేయాలి. వారికి అందుబాటులో వుంచడం, వారి ద్వారా రవాణా చేయడం నేరమే. బాలల్ని నిర్బంధించరాదు. లైంగిక దూషణ చేయరాదు. బాలల సంక్షేమానికై దోపిడీ ఏ రూపంలో వున్నా.. ప్రభుత్వాలు నిషేధించాలి. అంతర్జాతీయంగా గాని బాలలకు ఇంతకంటే మెరుగైన హక్కులను అందించే చట్టాలు ఉంటే ఆ హక్కులను పొందడానికి బాలలకు హక్కు వుంది. ఇవి బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి ఒడంబడిక సంక్షిప్తరూపం.



పిల్లల్ని బడికి పంపించాలి



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి పిల్లల్ని బడికి పంపించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలాంటప్పుడే బాలల హక్కులను కాపాడవచ్చు. తల్లిదండ్రులు విద్య ప్రాముఖ్యతను గుర్తించి పిల్లల్ని పాఠశాలలకు పంపాలి. ప్రభుత్వం కూడా పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకటేష్, ఉపాధ్యాయుడు, కొట్టాలచెరువు గ్రామం, ఆత్మకూరు మండలం.



వరి రైతు దగా

(5 పేజీ తరువాయి)

ఈ ఏడాది వివిధ రకాల తెగుళ్లు వరి పంటను ఆశ్రయించాయి. ఈ తెగుళ్ల బారినుంచి రక్షించుకోవడానికి భారీగా పురుగులు మందులు వాడారు. ఎండు తెగుళ్లు, అగ్గి తెగుళ్లు, కాటుక తెగుళ్లు సోకాయి. అగ్గి తెగుళ్లు కూడా విజృంభించాయి. ఈ తెగుళ్లు వరి మొక్క ఆకులు, మెడభాగం, కణుపులు, చివరి భాగాలను ఎక్కువగా ఆశించింది. అధిక వర్షాలకు తోడు నేలలో సరిపడా తేమ ఉండకపోవడంతో ఈ తెగులు వ్యాపించిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఆకు మచ్చ తెగులు పిలక దశ నుంచి పొట్ట దశ వరకు వ్యాపించడంతో రైతులు వివిధ రకాల పురుగుల మందు స్ప్రే చేసి పంటను సంరక్షించుకున్నారు. ఇందుకు భారీగా ఖర్చు చేశారు. అలాగే మచ్చతెగులు, కాటుక తెగుళ్ళు కూడా ఈ ఏడాది భారీగా ఆశించడంతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు.



రుద్రవరం మండలం చిత్తరేణిపల్లెలో వరి పొలం

గిట్టుబాటు ధర కల్పించాలి



వరిధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రస్తుతం క్వింటాలుకు కేవలం రూ.1750 ఉంది. ఈ ధరను రూ.2 వేలుకు పెంచాలి. ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

-చంద్రశేఖర్‌రెడ్డి, యాగంటిపల్లె రైతు

జాతీయ ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలి



జాతీయ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలి. పెట్టుబడి సాయం అందించాలి. రసాయనిక, పురుగు మందుల రేట్లు తగ్గించాలి. వరిధాన్యం మద్దతు ధరలు పెంచి రైతులను ఆదుకోవాలి.

-బంది రవీంద్రనాథరెడ్డి, యాగంటిపల్లె, రైతు

గత ఏడాది బస్తా ధాన్యం రూ.2వేలకు విక్రయించా



గత ఏడాది వరి ధాన్యం బస్తా రూ.2వేలకు విక్రయించా. ఈ ఏడాది 12 ఎకరాల్లో వరి సాగు చేశా. వరి ధాన్యం బస్తా రేటు రూ.1550 పలికింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఒక బస్తాకు రూ.450 నష్టపోయాం.

-సుబ్బారావు, రైతు, చిత్తరేణిపల్లె

గిట్టుబాటు ధర లేదు



వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు. 77 కేజీల బస్తా రూ.1550 మాత్రమే రేటు పలికింది. ఈసారి కౌలుకు తీసుకుని 17 ఎకరాలు వరి పంట సాగు చేశా. పెట్టుబడి, కౌలు కలిపి ఒక్కో ఎకరాకు 50వేలు ఖర్చు వచ్చింది. దిగుబడి 38 బస్తాలు వచ్చాయి.

-రామలింగం, రైతు, చిత్తరేణిపల్లె

రైతు కష్టానికి ఫలితం లేదు



వరి రైతుకు కష్టం పుడమిపాలైంది. ఈసారి గిట్టుబాటు ధర లేదు. గత ఏడాది వరి ధాన్యం బస్తా రూ.2వేలు రేటు పలికింది. ఈ ఏడాది రూ.1550 మాత్రమే రేటు పలుకుతున్నది. దీంతో రైతు నష్టపోవాల్సి వచ్చింది.

-మాధవ, రైతు, చిత్తరేణిపల్లె

పంట దిగుబడి తగ్గింది



సాధారణంగా 40 నుంచి 48బస్తాలు దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి ఎకరాకు 38 బస్తాలే దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర కూడా లేదు. వరి ధాన్యం ఈసారి రైతును నట్టేట ముంచింది.

-రామక్రిష్ణ, రైతు, చిత్తరేణిపల్లె

ఎంత ప్రమాదం



బండిఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ దృశ్యం చూడండి... ద్విచక్ర చిన్నవాహనం వెనుక సీట్లో ఇద్దరిని చెరో వైపు కూర్చోబెట్టుకుని ప్రయాణిస్తున్నాడు. నంద్యాల-ఆత్మకూరు ప్రధాన రహదారిలో బండిఆత్మకూరు వద్ద వెలుగోడు వైపు ఓ వాహనదారుడి ఇలా అత్యంత ప్రమాదకరంగా వెళ్తున్నాడు. ఏమాత్రం బండి అదుపుతప్పినా ప్రమాదం జరగడం తప్పనిసరి.

మహానందీశ్వరునికి కార్తీక నక్షత్ర పూజలు

మహానంది, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక మాస ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని మంగళవారం భక్తి శ్రద్ధలతో అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేకంగా తయారు చేసిన అనాన్ని మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలోని వంటశాల నుండి ప్రధాన ఆలయంలోకి తెచ్చారు. అనంతరం శివునికి పూజలు జరిపారు.

ట్రేడ్ లైసెన్సు బకాయిలు



(5 పేజీ తరువాయి)

నగర పాలక పరిధిలో ట్రేడ్ లైసెన్సు ఫీజు భారీగా పేరుకుపోయాయి. 2021 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ వరకు మొత్తం బకాయిలు రూ.11,35,23,531 ఉండగా రూ. రూ.8,07,12,580 వసూలు చేశారు. ఇంకా రూ.3,28,10,951 వసూలు చేయాల్సి ఉంది. దీనిపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిని వసూలు చేయడంలో నగర పాలక ఆరోగ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో నగరపాలక సంస్థకు పూర్తిస్థాయిలో గండిపడుతోంది. నగరంలో 50 వేలకు పైగా దుకాణాలు ఉండగా అధికారుల లెక్కల్లో మాత్రం 10,858 దుకాణాలకు లైసెన్సులు ఉన్నట్లు చూపిస్తున్నారు. లైసెన్సుకు నగదు వసూలు చేయని దుకాణాలు సుమారు 25 వేలకు వరకు ఉంటాయి. ఇందులో సిబ్బంది లైసెన్సు పేరుతో వసూలు చేస్తున్న నగర పాలక సంస్థకు జమచేయకుండా స్వాహ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రతి సంవత్సరం రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయి. బకాయిలు చాలా వరకు వసూలు చేసి లెక్కలు చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నగర పాలక ఉన్నతాధికారులు లైసెన్సు వసూళ్లపై దృష్టిసారిస్తే నగర పాలక ఆదాయం పెరుగుతోంది.

దోచుకుంటున్నారు...

నగరంలో సుమారు 7 లక్షల జనాభా ఉంది. చిన్న, పెద్ద దుకాణాలు కలిపి 50 వేలకు పైగా ఉంటాయి. నగర పాలక పరిధిలో 10858 దుకాణాలకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. నగర పాలక ప్రజారోగ్య విభాగం ప్రతి దుకాణం నుంచి లైసెన్సు, రెన్యువల్ వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1లోపల పూర్తి చేయాలి. ఏప్రిల్ నెలాఖరుకు చెల్లించని వారు 25 శాతం అపరాధ రుసుముతో కలిపి చెల్లించాలి. మే 1 నాటికి అన్ని దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. లేదంటే సంబంధిత అధికారి సొంత సొమ్ము జమ చేయాలి. రుసుము చెల్లించిన ప్రతి దుకాణాలోను లైసెన్సు ధృవీకరణ పత్రం ప్రదర్శించాలి. అయితే నగరంలోని పలు కాలనీల్లో పలువురు దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాంటి వారికి నగర పాలక అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

వసూలు చేస్తున్నాం

నగరంలో పెండింగ్ లేకుండా ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్నాం. విద్యుత్ శాఖ అధికారులకు నగరంలో ఎన్ని వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయో తెలపాలని లేఖ రాశాం. అక్కడ నుంచి వచ్చిన వెంటనే వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు తీసుకునేలా ప్రోత్సహిస్తాం. పాత బకాయిలు..కొత్తవి కలిపి సుమారు రూ.3 కోట్ల దాకా ఉంది. త్వరలోనే వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- కే.విశ్వేశ్వరరెడ్డి, ఆరోగ్య అధికారి, నగర పాలక సంస్థ

విశ్వకర్మ.. ఇదేం ఖర్మ

- పథకం మంచిదే.. అమలులోనే లోపాలు
- సమన్వయలోపంతో లబ్ధి చేకూరింది శూన్యం
- శిక్షణలో తిర'కాసు'
- పురోగతిలేక దరఖాస్తుదారులు గగ్గోలు

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం పురిటినొప్పులు పడుతోంది. గతేడాది సెప్టెంబరు 17న ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకం అమలులో ఆరంభశూరత్వంగా మారిందనే చెప్పాలి. పథకం ఉద్దేశం మంచిదే అయినా కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయలోపంతో అమలుకు నోచుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించగా అప్పటి పాలకులు ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు రావటంతో విశ్వకర్మ పథకం కొద్దికాలంపాటు అటకెక్కింది. కొన్నాళ్ల క్రితం ఈ పథకంలో చిన్నపాటి కదలిక మొదలైనా, నత్తనడకన నడుస్తుండటంతో ఆశించిన స్థాయిలో పురోగతి కానరావటం లేదని దరఖాస్తుదారులు గగ్గోలు పెడుతున్నారు.



జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయం

అభివృద్ధికి అవాంతరం

కులవృత్తులను ప్రోత్సహిస్తూ, వారిలోని కళానైపుణ్యాన్ని వెలికి తీయటంతో పాటు వారిని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సత్సంకల్పంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఇందులో పలు ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, పురపాలక, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, బ్యాంకర్లు, నైపుణ్యాభివృద్ధి సంస్థ తదితర శాఖలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేశారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. అన్ని శాఖలను కలెక్టర్ సమన్వయపరుస్తూ అజమాయిషీ చేయాల్సి ఉండగా, తీరిక లేని విధుల్లో భాగంగా కొంత నిర్లిప్తత నెలకొంది. ఫలితంగా బాధ్యతాయుతమైన శాఖలు సైతం కొంత అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. పథకం ప్రారంభమై ఏడాది దాటినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ, నమోదు, శిక్షణ స్థాయిలోనే అవసరార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే శిక్షణ పూర్తి చేసి, గుర్తింపు కార్డుల జారీ, పనిముట్ల అందజేత, రుణాల మంజూరు, ఉత్పత్తుల మార్కెటింగ్ ఇంకెప్పుడో జరుగుతుందోనని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

సాంకేతిక సమస్యలు.. సమన్వయ లోపం

కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లు విశ్వకర్మ పథకం అమలులోనూ అన్నే అవాంతరాలు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్షకు పైగానే ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కాని వీటి పరిశీలన చాలా మందకొడిగా సాగుతోంది. పలు శాఖల్లో సిబ్బంది కొరత, సర్వర్లతో సాంకేతిక సమస్యలు, శాఖల మధ్య సమన్వయలోపం, ప్రజల్లో విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన రాహిత్యం వెరసి పనులు నెమ్మదిగా నడుస్తున్నాయి. ఒక్క దరఖాస్తు పరిశీలనకే దాదాపు 15 నిమిషాలు సమయం తీసుకోనుంది. జిల్లా పరిశ్రమల కేంద్రంలో జనరల్ మేనేజర్, డీడీ, ఏడీ తదితర కీలక శాఖలు ఖాళీగా ఉండటంతో ఒక్కరిపైనే పని భారం పడుతోంది.

శిక్షణలో తిరకాసు: విశ్వకర్మ యోజన పథకం ద్వారా అర్హులైన వారికి శిక్షణను ఇచ్చేందుకు నగరంలో 12 చోట్ల ప్రైవేటు వ్యక్తులు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరు రోజుల శిక్షణ కాలంలో శిక్షణార్థులకు రోజుకు రూ.680 చొప్పున మొత్తం సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. శిక్షణ సంస్థలకు ఒక్కో వ్యక్తికి ఇంత చొప్పున ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తోంది. ఇక్కడే తిరకాసు ఉంది. కొంత మంది శిక్షణ కేంద్రాల నిర్వాహకులు లేని కోర్సులను సైతం తమ వద్ద ఉన్నట్లు చూపిస్తూ, శిక్షణార్థులను పేర్లను నమోదు చేసుకుని వేరే ప్రాంతాల్లోని తమ శాఖల ద్వారా శిక్షణ పొందినట్లు చూపిస్తున్నారు. ఇలా బోగస్ శిక్షణతో ప్రభుత్వం నుంచి బిల్లులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరి కొంత మంది కేంద్రం నిర్వాహకులు, దరఖాస్తుదారులను తమ వద్ద చేర్చుకొని వారికి ఆన్‌లైన్‌లో ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించి వారికి శిక్షణ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఇలా ఒకే కేంద్రం నిర్వాహకుడు దాదాపు 800 మందికి శిక్షణ ఇవ్వకుండా తమ వద్దనే పట్టిపెట్టినట్టు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రైవేటు కేంద్రాల నిర్వాకం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ అయిన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థకు అభ్యర్థులు కరువయ్యారు. ప్రైవేటు కేంద్రాలు ఇప్పటికే కొన్ని బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేయగా, ఇక్కడ మాత్రం ఇంత వరకు ఒక్క మనిషికి కూడా శిక్షణ ఇవ్వకపోవటం గమనార్హం.

సరైన సహకారం లేదు



విశ్వకర్మ యోజన పథకం ఉద్దేశం బాగుంది. కానీ వీటి అమలులో ప్రభుత్వ శాఖలు సరియైన సహకారం అందిచటం లేదు. పథకంపై అవగాహన కల్పించటం లేదు. ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేయడం లేదు. శిక్షణ సంస్థలు సైతం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దోచుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ చూపితే పథకం గాడిన పడుతోంది

.- రాంబాబు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి

అమలులో అడ్డంకులు..

తొలుత ఈ పథకం కింద 18 కులవృత్తుల వారిని అర్హత ఆధారంగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీంతో అన్ని కులాలతోపాటు టైలరింగ్, బేల్దారు పనికి సంబంధించి విపరీతమైన డిమాండు నెలకొని భారీ స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. కాని ముందస్తు సమాచారం లేకుండానే వీటిని ఈ పథకం నుంచి తొలగించారు. ఫలితంగా పెద్ద మొత్తంలో దరఖాస్తులు నిరాశకు లోనవుతున్నారు. వడ్రంగికి సంబంధించి సైతం దరఖాస్తు స్వీకరణ, పరిశీలనలో కొంత అలసత్వం నెలకొనటంతో ఈ కోర్సుపై కూడా అవసరార్థుల్లో సందేహాలు తలెత్తుతున్నాయి.

ముంచేసిన ఫేస్‌బుక్ పరిచయం!

- యువతీ, యువకుల మధ్య డబ్బు గొడవ
- ఆత్మహత్యకు యత్నించిన యువతి

పత్తికొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలకు గురై జీవితాలు కోల్పోతున్న వారు కొందరైతే డబ్బుపోగొట్టుకుని లబోదిబోమనేవారు ఎందరో? వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ ప్లాట్‌ఫాంలో పరిచయాలు నమ్మకూడదంటూ నిత్యం పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా మోసపోయేవారు మోసపోతూనే ఉన్నారు. అలా ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ అబ్బాయిని మోసం చేసి ఏకంగా రూ.1.20 కోట్లు కాజేసింది పత్తికొండకు చెందిన ఓ యువతి. పత్తికొండ పట్టణానికి చెందిన ఓ యువతి ఫేస్ బుక్ ద్వారా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ముత్తారం గ్రామానికి చెందిన సాయికి ఐదేళ్ల క్రితం పరిచయమైంది. సాయి స్థానికంగా కెమికల్‌కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఫేస్ బుక్‌లో పత్తికొండ యువతి తన చెల్లెలి ఫొటోతో ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేసుకుని చాటింగ్ చేస్తూ మోసగించింది.

ఆన్‌లైన్‌లోనే వారిద్దరి పరిచయం కాస్తా ఆర్థిక వ్యవహారాలకు దారి తీసింది. సదరు యువతి ఏవేవో కారణాలు చెబుతూ రూ.1.20 కోట్లను పలు దఫాలుగా సాయితో బ్యాంకు ఖాతాకు మళ్లించుకుంది. విషయం పసిగట్టిన బాధితుడు సాయి యువతిని పటాన్‌చెరుకు పిలిపించుకుని తనకు రావాల్సిన మొత్తంపై అగ్రిమెంట్ రాయించుకున్నాడు. అగ్రిమెంట్ సమయం ముగుస్తున్నా డబ్బు రాకపోవడంతో నేరుగా పత్తికొండకు వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. తాను చేసిన మోసం బయటపడటంతో యువతి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఈ విషయంపై యువతి తండ్రి మాట్లాడుతూ తమ కుమార్తె డబ్బు తీసుకున్న విషయం నిజమేనని, అయితే అప్పటికే పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చేచేశామని చెప్పాడు. అయినప్పటికీ యువకుడు సాయి నుంచి వేధింపులు అధికం కావడంతోనే తన కుమార్తె ఆత్మహత్యకు యత్నించిందని వాపోయాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


ఊపిరి తీసుకోవడమే కష్టం

- పెరుగుతున్న సీవోపీడీ బాధితులు
- తొలి దశల్లో గుర్తిస్తేనే చికిత్స
- నేడు వరల్డ్ సీవోపీడీ డే



కర్నూలు హస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్ (సీవోపీడీ) అనేది ఊపిరితిత్తుల వ్యాధి. సీవోపీడీ సమస్యల్లో క్రానిక్ బ్రాంకైటీస్, ఎంఫెసెమా రకాలు కనబడుతాయి. ఏటా నవంబరు మూడో బుధవారం వరల్డ్ సీవోపీడీ డేను నిర్వహిస్తున్నారు. ప్రతి ముగ్గురు స్మోకర్స్‌లో ఒకరికి ఈ జబ్బు వస్తుంది. సీవోపీడీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు డబ్ల్యూహెచ్‌వో ఈ ఏడాది "మీ ఊపిరితిత్తుల పనితీరును తెలుసుకోండి".. అన్న నినాదాన్ని ఇచ్చింది.

ఉమ్మడి జిల్లాలో సీవోపీడీ బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పదేళ్ల క్రితం జనాభాలో 3 శాతం కంటే ఈ వ్యాధి ఇప్పుడు 8 శాతానికి పెరిగింది. సీవోపీడీ వ్యాధిగ్రస్థుల్లో 65 శాతం పొగతాగే అలవాటు ఉన్న వారే ఉన్నారు. మిగిలిన బాధితులు పరిశ్రమల్లో దుమ్మూ, ధూళి, పొగ, కాలుష్య రసాయనాల మధ్య పనిచేసే వారు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని డోన్, బేతంచెర్ల, బనగానపల్లె, అవుకు, కర్నూలు పారిశ్రామిక ప్రాంతాల్లో సీవోపీడీ బాధితులు అధికంగా ఉన్నారు. ఇక కర్నూలు జీజీహెచ్‌లోని ఊపిరితిత్తుల వార్డుకు ప్రతిరోజు ఓపీ కేసులు 120 దాకా ఉంటాయి. వీరిలో 50 శాతం సీవోపీడీ బాధితులు వస్తుంటారు. వీరికి ఇన్‌హెలర్స్, యాంటి బయాటిక్స్ మందులు ఇచ్చి చికిత్స అందిస్తున్నారు.



చికిత్స

మందుల కన్నా ముందు కౌన్సిలింగ్ బాలా అవసరం. పొగతాగడం మానేయాలి. బ్రాంకో డైలేటర్స్, ఇన్‌హెలర్స్, స్టెరాయిడ్స్ ఛాతీ వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. ఆక్సిజన్ థెరపీ దీర్ఘకాలికంగా రోజుకు కనీసం 15 గంటలు తీసుకోవాలి. ఊపిరితిత్తుల వ్యాయామం, ప్రాణాయా మం, లంగ్ మార్పిడీ చేయించుకోవాలి. ఇన్‌ఫ్లూయెం జీ వ్యాక్సిన్, న్యూమోకోకల్ వ్యాక్సిన్‌ను ఇప్పించాలి.

వ్యాధి లక్షణాలు

- ఆయాస పడడం, దగ్గు..
- ఛాతి బిగుసుకుపోవడం
- శ్వాసలో గురగుర శబ్దాలు
- పనులు చేసుకోలేకపోవడం





ప్రతి రోజు 50 కేసులు

కర్నూలు జీజీహెచ్‌కు ప్రతిరోజు ఓపీ 80 నుంచి 120 దాకా ఉంటుంది. ఈ కేసుల్లో 50 కేసులు సీవోపీడీ నుంచి వస్తుంటాయి. నడిస్తే ఆయాసం, దగ్గు, పిల్లికూతలుఈ వ్యాధి లక్షణాలు. సీవోపీడీ బాధితు లకు న్యూమోనియా, ఫ్లూఇన్‌ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. **- డా. అంబర్‌నాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఊపిరితిత్తుల విభాగం, కర్నూలు జీజీహెచ్**



సీవోపీడీ దీర్ఘకాలిక జబ్బు

సీవోపీడీ ఒక దీర్ఘకాలిక జబ్బు. ఇది బీడీ, సిగరెట్ తాగే వారిలో 90 శాతం జబ్బు వస్తుంది. ఎక్కువగా 40ఏళ్ల పైబడిన వారిలో కనిపిస్తుంది. వరల్డ్ సీవోపీడీ డేను పురస్కరించుకుని నగరంలోని న్యూనాగిరెడ్డి రెవెన్యూ కాలనీ శ్రీసాయి చెస్ట్ అండ్ అలర్జీ క్లీనిక్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచితంగా స్పైరో మెట్రి పరీక్షలు నిర్వహించనున్నాం. **- డా.జి. కుల్లాయప్ప, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణుడు**



ఇన్‌హెలర్లతోనే ఉపశమనం

సీవోపీడీ వ్యాధికి ఇన్‌హెలర్ల వాడకంతో ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆయాసం మొదలైనప్పుడు జాగ్రత్త పడాలి. పొగతాగడం మానేయాలి. సీవోపీడీ ఉన్న రోగులు ముఖ్యంగా ప్రొటీన్ డైట్ తీసుకోవాలి. మహిళలకన్నా పురుషుల్ల 40 ఏళ్ల పైబడిన వారిలో ఎక్కువగా వస్తుంది. **- డా.కే. శివకృష్ణ, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణుడు, శ్రీశ్వాస చెస్ట్ అండ్ అలర్జీ క్లీనిక్, కర్నూలు**

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గానికి చెందిన షేక్ దస్తగిరి కుమార్తె షేక్‌మాబూచాంద్‌ను ఆమె భర్తషేక్ అమీర్‌బాషా, అత్త లతీఫ్ ఉన్నీసా, ఆడబిడ్డ రషీదాబీ అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా హింసిస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. షేక్ మాబూచాంద్‌కు 8 సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డ మండలం చింతకుట గ్రామానికి చెందిన షేక్ అమీర్‌బాషాతో వివాహమైంది. వివాహ సమయంలో రూ. 2లక్షల నగదు, 5తులాల బంగారు కట్నం ఇచ్చారు. అదనంగా ఆమె తండ్రి పేరు మీద ఉన్న మరో అర ఎకరా పొలం తీసుకొని రావాలని అత్తింటివారు వేధిస్తుండడంతో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారి ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీ కెనాల్‌లో మహిళ మృతదేహం



వెంకట లక్ష్మమ్మ (ఫైల్)

శిరివెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండల పరిధిలోని కేసీ కెనాల్ కామినేనిపల్లె 16వ లాక్ వద్ద ఓ మహిళ మృత దేహం మంగళవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం అందించడంతో పోలీసులు మృత దేహాన్ని కాల్వలో నుంచి బయటకు తీయించారు. మృతు రాలు గోవిందపల్లె గ్రామానికి చెందిన మేగల వెంకట లక్ష్మమ్మ(47)గా గుర్తించారు. వెంకట లక్ష్మమ్మ మానసికస్థితి కొంత కాలంగా సరిగా లేదని.. ఈ నెల 17న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు భర్త లక్ష్మయ్య పోలీసులకు తెలిపారు. ప్రమాదవశాత్తు కేసీ కాల్వలో పడి మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వెంకట లక్ష్మమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఉలిగమ్మ (ఫైల్)

ఆదోని రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పెద్దతుంబళం- కోసిగి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోసిగికి చెందిన పండ్ల వ్యాపారి ఉలిగమ్మ(50)మృతి చెందింది. ఆమె రోజూ కోసిగి నుంచి ఆదోనికి వచ్చి వివిధ రకాల పండ్లను విక్రయించి తిరిగి సొంత ఊరికెళ్లేది. ఈ క్రమంలో మంగళవారం ఆటోలో సదరు ఉలిగమ్మ ఆదోనికి బయల్దేరింది. వీరు ప్రయాణిస్తున్న ఆటో పెద్దతుంబళం క్రాస్ వద్దకు రాగానే అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఉలిగమ్మతోపాటు ఇందు, సోమక్క, పార్వతి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉలిగమ్మ మృతి చెందింది. మృతురాలికి ఏడుగురు ఆడపిల్లలు, మగ పిల్లవాడు ఉన్నారు. భర్త వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెకుంట గ్రామానికి చెందిన కొణిదేల వెంకట్రాముడు (44) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకు న్నాడు. పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేననే నిరాశకు గురై సోమవారం తన పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.



వెంకట్రాముడు మృతదేహం

డ్రిప్ ఇరిగేషన్‌కు కేంద్రం నిధులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సేద్యానికి కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.73.06కోట్లు నిధులను భరించేలా అనుమతి తెచ్చింది. కర్నూలు జిల్లాలో 15వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 15వేల హెక్టార్లలో ఈ ఏడాది డ్రిప్పు సేద్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఐదెకరాల్లోపు రైతులకు 90 శాతం ఐదెకరాలకు పైబడి పది ఎకరాలలోపు 70 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం పరికరాలను రైతుల పొలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష్యం మేరకు డ్రిప్ ఏర్పాటు కోసం రూ.134.89 కోట్లు ఖర్చు అవుతుందని, ఇందులో కేంద్రం రూ.73.06 కోట్లు భరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.48.70 కోట్లు ఇస్తున్నట్లు పీడీ ఉమాదేవి తెలిపారు. రైతులు తమ వాటా రూ.13.13 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 08518-279724, 7995078264, 6303613097 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బనగానపల్లెలో దారుణ హత్య

- ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి
- ఆస్తి తగాదాలే కారణం



శ్రీరాములు (ఫైల్)

బనగానపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బనగానపల్లె పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బనగానపల్లె మున్సిపల్ పరిధిలోని బానుముక్కలకు చెందిన చిలకన్నగారి శ్రీరాములు(44) అనే వ్యక్తిని మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం మేరకు... అన్నకుమారులైన వెంకటగిరి, వెంకటేశ్వర్లుతో శ్రీరాములుకు గతంలో పొలం తగాదాలు ఉండేవి. పొలం తగాదాను పెద్దల సమక్షంలో పరిష్కరించు కున్నారు. అయితే ఓ ఇంటి విషయంపై కూడా ఇరు కుటుంబాల మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. దీంతో శ్రీరాములుపై అన్నకుమారులు వెంకటగిరి, వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం తన ఇంటి వద్ద మోటారు సైకిల్ పెట్టి ఇంట్లోకి వెళ్తున్న శ్రీరాములుపై అన్న కుమారులు వెంకట గిరి, వెంకటేశ్వర్లు.. గొల్ల రామమద్దిలేటి అనే వ్యక్తితో కలసి విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేశారు. కుటుంబ సభ్యులు గుర్తించి శ్రీరాములును మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. శ్రీరాములు తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడి తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించండి

- క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రారెడ్డి



సీసీరోడ్డు నాణ్యతను తనిఖీ చేస్తున్న ఇంజనీర్లు

కర్నూలు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్‌శాఖ సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డివిజనల్ ఇంజనీర్ రవీంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. కర్నూలు మండలంలోని జి. శింగవరంలో రూ.10లక్షలు, బావాపురంలో రూ.49లక్షలు, బి.తాండ్రపాడులో రూ.15లక్షలు వ్యయంతో పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారు లు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే సహించబోమని డీఈ సూచించారు. వారి వెంట కర్నూలు మండల పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ ముక్తార్‌బాషా, క్వాలిటీ కంట్రోల్ ఏఈ విజయభాస్కర్ ఉన్నారు.

వస్తుసేవల్లో వినియోగదారులకు ఫోరం రక్షణ

- జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి అనిత



మాట్లాడుతున్న అనిత

పాణ్యం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వస్తుసేవల్లో వినియోగదారుడు మోసపోయినపుడు వినియోగదారుల రక్షణ ఫోరం న్యాయం చేస్తుందని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి అనిత పేర్కొన్నారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన తూనికలు, కొలతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాలలో తూనికలు, కొలతల పరికరాల ద్వారా జరిగే మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాషా, హెచ్‌ఎం మేరీసునీత, ఫోరం సభ్యులు రజనీకాంత్, సాంకేతిక నిపుణులు శ్రీరాములు పాల్గొన్నారు.

బియ్యం బ్లాక్ మార్కెట్‌కు..!



ఎండీయూ వాహనం

(5వ పేజీ తరువాయి)

గ్రామ స్థాయి నుంచే రేషన్ మాఫియా యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి నెలా మొదటి తేదీలోపు సివిల్ సప్లైస్ గోదాముల ద్వారా నిర్దేశిత రేషన్ షాపులకు పీడీఎస్ బియ్యం సరఫరా అవుతోంది. అయితే స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనీ ఫిర్యాదులు వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం పేదలకోసమని భారీగా ఖర్చు చేస్తుంటే.. దానిని రేషన్ మాఫియా తమకు ఆదాయం వనరుగా మార్చుకుంది. రేషన్ మాఫియా చేసే దందాను పోలీసులు, రెవెన్యూ అధికారులు అనేకసార్లు పట్టుకుని కేసులు నమోదు చేసినా, జరిమానాలు విధించిన మళ్లీ అదే తరహా అక్రమ వ్యాపారానికి రేషన్ మాఫియా సిద్ధపడుతోంది.

పర్యావరణ అనుకూలంగా ఈఈఎస్‌ఎల్ పరికరాలు

నంద్యాల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి); పర్యావరణానికి ఈఈఎస్ ఎల్ పరికరాలు అనుకూలమని నంద్యాల జిల్లా విద్యుత్ ఎస్ఈ సుధాకర్‌కుమార్ తెలిపారు. మంగళవారం నంద్యాల డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈఈఎస్ఎల్ ఊర్జావీర్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈఈఎస్ఎల్ కంపెనీతో అనుసంధానం చేసుకుందని అన్నారు. వీటివల్ల ప్రజలకు విద్యుత్ భారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1145 మందిని ఊర్జా వీర్ యాప్‌లో నమోదు చేయించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు. టెక్నికల్ నాగేశ్వరరావు, ఈఈలు శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీతో విద్యార్థుల ముఖాముఖి

నంద్యాల రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాతో ఆర్టీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థులు ముఖాముఖి చర్చల్లో పాల్గొన్నారు. ఆర్టీఎం పది కార్యక్రమాల రూపకల్పనలో భాగంగా మంగళవారం విద్యార్థులు గంట పాటు ఎస్పీతో నేరాల వివరాలు, శిక్షలు, వేధింపులు తదితర అంశాలపై ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల కార్మిక చట్టాలు, సాంకేతిక వినియోగం, అవినీతి నిర్మూలన, మహిళలపై వేధింపులు, అజాగ్రత్తగా వాహనాలు నడపడం నేరాల నిర్మూలనపై పోలీసుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరాలపైపూర్తి అవగాహన ఉండాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గురుసాయి కౌశిక్, చేతన్‌రెడ్డి, సాధన, అక్షరాసింగ్, భువనేశ్వర్‌రెడ్డి, శశాంత్, ధార్మిక, నిఖిల్, సాక్షిత్, భానుతేజ, తన్విక పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో మహిళ మృతి

- పొగ మంచు కారణంగా..



ఉలిగమ్మ (ఫైల్)

కోసిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి 1వ వార్డుకు చెందిన దళవాయి మంగమ్మ (50) ఆటో బోల్తా పడి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. కోసిగి నుంచి ఆటోలో ఉదయం 5.30 గంటలకు ఆదోనికి వెళ్తుండగా.. పెద్ద తుంబళం గ్రామ సమీపంలో పొగ మంచు కారణంగా రోడ్డు కనపడకపోవడంతో ఎదురుగా వస్తున్న ఆవులను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఉలిగమ్మ తీవ్ర రక్తగాయాలకు గురైంది. ఆదోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కూతురు పార్వతి, డ్రైవర్ మహదేవ గాయ పడ్డారు. పెద్ద తుంబళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారరు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- ముగ్గురి అరెస్ట్

గుత్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువకులను మోసగించిన కేసులో సోమవారం రాత్రి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గుత్తిఆర్ఎస్‌కు చెందిన కాలవ నిఖిల్‌తో పాటు మరికొంత మంది యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కర్నూలు నగరానికి చెందిన పెద్దిశెట్టి మేరీ సునీత, మరికొందరు నమ్మించారు. దీంతో ఆ యువకులు సుమారు రూ.1.50 లక్షలు చెల్లించారు. వీరికి ఉద్యోగాలు ఇప్పించడం ఆలస్యం కావడంతో ఒత్తిడి చేశారు. దీంతో ఇద్దరికి నకిలీ జాయినింగ్ లెటర్లు ఇప్పించారు.

దీన్ని తీసుకుని ఆ యువకుడు చీరాల మండల తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరేందుకు వెళ్లాడు. అది నకిలీ జాయినింగ్ లెటర్ అని తెలుసుకున్నాడు. దీంతో డబ్బులు వాపసు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో నిఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు మోసం చేసిన పెద్దిశెట్టి మేరీ సునీత, అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ఎల్లంపల్లికి చెందిన గుర్రం ప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లి మండలం కుక్కరాజుపల్లికి చెందిన షేక్ బాబ్‌జాన్ సాహెబ్‌ను సోమవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. దీంతో రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'పౌర సరఫరా'లో అవినీతి

- గత ప్రభుత్వంలో భారీ ఎత్తున అక్రమాలు
- నాణ్యమైన బియ్యం అందించడమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ


గోదామును తనిఖీ చేస్తున్న కొంగతి లక్ష్మీనారాయణ

కర్నూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పౌర సరఫరాల విభాగాన్ని అవినీతి కూపంగా మార్చారని, పేదలకు రాయితీ బియ్యం సరఫరాలో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ ఆరోపించారు. మంగళవారం కర్నూలు నగరం రేడియో స్టేషన్ సమీపంలో ఉన్న పౌర సరఫరాల శాఖ బఫర్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం సహా గోదాములో నిల్వ చేసిన సరుకుల రికార్డులు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు భారం భరిస్తూ పేదలకు రాయితీ బియ్యం ఇస్తుందని, తూకాల్లో తేడా లేకుండా సరఫరా చేయాలని సూచించారు. అనంతరం లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడారు. పేదలకు మూడు పూటల ఆకలి తీర్చి ఆహార భద్రత కల్పించాలనే ఉన్నత ఆశయంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహన్‌లు పేదల కు నాణ్యమైన బియ్యం అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లయ్‌ను అవినీతి అక్రమాల కేంద్రంగా మార్చారని ఆరోపించారు. ఇప్పటికే గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులు, సిబ్బం దే ఉన్నారని, గతంలో కాకుండా టీడీపీ కూటమి లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. గతంలో లాగే పని చేస్తామంటే శాఖప రమైన చర్యలకు సిద్ధంగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌దే అగ్రస్థానం


లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్లను సత్కరిస్తున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌దే అగ్రస్థానమని పూర్వ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య అన్నారు. మంగళవారం నగర శివారులో వెల్దుర్తి రోడ్డులోని అమెజాన్ రిసార్ట్స్‌లో జరిగిన కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ గెట్ టు గెదర్, జోన్ అడ్వయిజరీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ బాల మద్దయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండా లని సూచించారు. మరో పూర్వ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మాణిక్యప్రభు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండి స్నేహభావంతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా పూర్వ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్లను సత్క రించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ రాహుల్, జోన్ చైర్మన్ ప్రభాకర్, మెల్విన్స్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, రామరాజు, రత్నప్రసాద్, వెంకటరామయ్య, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌లతోపాటు జోన్, నంద్యాల, బేతంచర్ల క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపాడు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని గుట్టపాడు టీడీపీ సర్పంచ్ మోహన్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు, విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి పూజారి కోరారు. మంగళవారం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి మోసం చేస్తున్నారన్నారు. పరిశ్రమలో ఓపెన్ బ్లాసింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కర్నూలు కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాల యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆరో రోజు మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి, మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. తొలుత ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేసీ కల్కూర హాజరయ్యారు. అతిథులుగా న్యాయవాది ఎల్ హేమలతారెడ్డి, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీ సంజీవలక్ష్మి, కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి, ఆదాయపన్ను శాఖ అధికారి స్టెల్లా పాల్గొన్నారు. వక్తలు గ్రంథాలయ ఆవశ్యకతను తెలియజేశారు. అతిథులు వివిధ రంగాలకు చెందిన మహిళ లను ఘనంగా సత్కరించారు.

ఉన్నత పాఠశాలల పని వేళల మార్పు సరికాదు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పనివేళలను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్పు చేయాలనే నిర్ణయం సరికాదని, దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం కోరారు. ప్రస్తుతం ఉన్న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకున్న పనివేళలు పిల్లల మానసిక స్థితికి, వాని అవధాన స్థితికి సరైనదని తెలిపారు. విద్యార్థులు ఐదారు కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తుంటారని, 5 గంటలకు బయలుదేరితే ఇళ్లకు చేరడం ఆలస్యమవుతుందని అన్నారు.

గ్లకోమా వాల్వ్ ఇంప్లాంట్ సర్జరీ


రోగితో కంటి వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్లకోమా (నీటి కాసుల)తో బాధపడుతున్న అనంతపురం జిల్లా గుంత కల్లుకు చెందిన రిటైర్డు ఉద్యోగి అంజినయ్యకు సుశీల నేత్రాల కంటి వైద్యులు గ్లకోమా వాల్వ్ ఇంప్లాంట్ సర్జరీని విజయవంతంగా నిర్వ హించారు. అల్లూరు మండలం మొలగవెల్లికి చెందిన గోవిందప్ప రిటైర్డు అయిన తర్వాత గుంతకల్లులో ఉంటున్నారు. చిన్నప్పుడే ఆయన కుడికన్ను చూపు పూర్తిగా కోల్పోయారు. 2023 ఆగస్టులో ఎడమకన్ను కార్నియా మార్పిడిని కార్నియా స్పెషలిస్టు డాక్టర్ ఈశ్వర్ నిర్వహించారు. కంటి చూపు బాగానే ఉన్నా రోగికి గ్లకోమా వ్యాధి ఉండటంతో చూపును క్రమం గా కోల్పోతున్నారు. దీంతో రోగి రెండు రోజుల క్రితం సుశీల నేత్రాల సీఈవో డాక్టర్ పి.సుధాకర్‌రావును కలిశారు. పరీక్షలు నిర్వహించగా.. కంటిలో ఒత్తిడి 12 నుంచి 25 మిల్లీమీటర్ల ఉండాల్సి ఉండగతా.. అతనికి 50కి పైగా ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారు. దీంతో సోమవారం రోగికి అహ్మద్ గ్లకోమా వాల్వ్ ఇంప్లాంట్ సర్జరీని గ్లకోమా స్పెషలిస్టు డాక్టర్ విజయలక్ష్మి, కార్నియా స్పెషాలిటీ డాక్టర్ ఈశ్వర్ విజయవంతంగా నిర్వహించారు. రోగికి అమెరికా నుంచి తెప్పించిన గ్లకోమా వాల్వ్ ఇంప్లాంట్‌తో సర్జరీ చేశారు. దీంతో చూపుకోల్పోయిన రోగికి కంటి చూపు మెరుగవడం, కంట్లో ఒత్తిడి 9 మిలీమీటర్లకు చేరుకుంది. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ సావిత్రి, రెటినా స్పెషలిస్టు డాక్టర్ నేహసుధాకర్, అకురోప్లాస్టీ, డాక్టర్ నేహాఘోస్, గ్లకోమా స్పెషలిస్టు డాక్టర్ విజయలక్ష్మి, కార్నియా స్పెషలిస్టు డాక్టర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు వాసురెడ్డి, వినీషారెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ని ధర్మపేటలో మంగళవారం వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్లు వాసురెడ్డి వినీషారెడ్డి దంపతులు ఉచిత వైద్యశిబిరం నిర్వ హిం చారు. దాదాపు 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ వినీషారెడ్డి మాట్లాడుతూ చలి కాలంలో ఫ్లూ, జలుబు రాకుండా ప్రజలు రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలన్నారు. అలర్జీ ఉన్న వారు పడని వస్తువులకు దూరంగా ఉండాలని, కాలుష్యం గల ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నగర అధ్యక్షులు షేక్ జిలానీబాషా, బతుకన్న, అనంత రత్నం మాదిగ, దామోదరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు నారాజు, లక్ష్మీరాజు ఆధ్వర్యంలో జిల్లా వీఆర్ఏ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వీఆర్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ సతీష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీఆర్ఏ జిల్లా అధ్యక్షుడిగా చిన్న స్వామి, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, సభ్యులు మొత్తం 26 మంది ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధార్ క్యాంపులను ప్రజలు, విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్.రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు మండలంలో ఈనెల మొదటి విడత 19, 20 తేదీల్లో, రెండో విడత ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

యాంటి బయాటిక్స్ ప్రమాదకరం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు యాంటిబయాటిక్స్ వాడటం మానుకోవాలని, అతిగా వాడితే ఎంతో ప్రమాదకరమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టినరసమ్మ అన్నారు. కాలేజీలోని మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో యాంటి మైక్రో బియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలు సందర్భంగా ఎంబీబీఎస్ రెండో సంవ త్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేణుకాదేవి, మెడిసిన్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ డాక్టర్ సుధాకుమారి, నాగజ్యోతి, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 కేసులు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీ.క్యాంపు వద్ద ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐలు హుశేన్, సమీర్‌బాషా సిబ్బంది తనిఖీలు చేసి 7 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, ఒకటి టాటా మేజిక్ ఆటో, 3 కార్లు కలిపి మొత్తం 14 కేసులు నమోదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేశామని, వీరిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోండి

సి.బెళగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఈవోఆర్డీ ఈశ్వరస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రిన్సిపాల్ బీ రెడ్డి ప్రసాద్ అధ్యక్షతన ఇందిరాగాంధీ చిత్రపటానికి క్లస్టర్ యూనిర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉప సర్పంచ్

ఓర్వకల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో ప్రజలకు టీడీపీ సభ్యత్వ నమోదుపై ఉప సర్పంచ్ షమీనాబీ, టీడీపీ నాయకుడు అన్వర్ బాషా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షలు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుం దన్నారు. టీడీపీ నాయకలు షాషావలి, సర్దార్ పాల్గొన్నారు.

గూడూరు: టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు, పాలు అన్నారు. మంగళవారం గూడూరులోని ఆయా కాలనీల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఓర్వకల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం జడ్పీహెచ్, ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంఈవో ఓంకార్ యాదవ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం పాఠశాలలో ఆయన రికార్డు లను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు అరగంట పాటు క్రీడా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. మంగళవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కమిషనర్ విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని, పీఈటీలు బాదల్, వజ్రారాజు పాల్గొన్నారు.

ఫన్‌టౌన్‌కు 2 ఎకరాలు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నగర పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫన్‌టౌన్‌కు రెండు ఎకరాల స్థలం కేటాయించాలని మెప్మా పీడీ నాగశివలీల కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుకు లేఖ రాశారు. హైదరా బాదులోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన విధంగా ఈ రెండెకరాలలో కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చిన్న అమ్యూ జ్‌మెంట్ పార్కు అభివృద్ధి చేసి సెలవు రోజుల్లో ఆనందంగా గడిపేందుకు వీలుగా అన్ని రకాల వసతులు కల్పిస్తామని లేఖలో పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోప్రభుత్వ/ప్రైవేటు స్థలం కనీసం రెండు ఎకరాలు గుర్తించాలని ఆమె కోరారు. రెండు వారాల్లో నివేదికలను మెప్మా మిషన్ డైరెక్టర్‌కు పంపాలని లేఖలో పేర్కొన్నారు.

ఆర్‌యూ వీసీని తొలగించాలి

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివ ర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను పదవి నుంచి తొలగించాలని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. రాఘవేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌టీకే నాయక్ అనే పర్యాయాలు ఉన్నతాధికారులను మభ్యపెట్టి రిజిస్ట్రార్, పరీక్షల విభాగం డీన్ పదవులు పొంది అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వర్సిటీలో రూ. 1.45 కోట్లు నిధులు ఖాజేశారని, విజిలెన్స్ విభాగం కూడా కేసు నమోదు చేసి విచారణలో కూడా జాప్యం చేస్తోందని మండి పడ్డారు. విజిలెన్స్ విచారణకు పాలక మండలి ఆమోదం తెలిపితే ఎందుకు ఇంత వరకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

కర్నూలు కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని విశ్వహిందూ పరిషత్ అనుబంధ మహిళా సంస్థలైన మాతృ శక్తి, దుర్గావాహిని ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కొండారెడ్డి బురుజు వద్ద యువతులు కరాటే ప్రదర్శనలు చేశారు. వినాయక ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పార్వతీదేవి హాజరై ప్రసంగించారు. బ్రిటీషు వారిపై పోరాటం చేసి అశువులు బాసిన వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి అని అన్నారు. కార్యక్ర మంలో మాతృశక్తి, దుర్గావాహిని సంస్థల ప్రతినిధులు జంపాల రాధిక, ఈపూరి లక్ష్మి, నీలి సింధూర, శ్రీవాణి, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని వృథా చేస్తే ఊరుకోం: కమిషనర్


సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజాధనం వృథా చేస్తే ఊరుకోమని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. మంగళవారం చెక్‌పోస్టు సమీపంలోని మారుతి నగర్‌లో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆయన పరిశీలించారు. మారుతినగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో మురుగు కాలువలను ప్రధాన డ్రైనేజీకి అనుసంధానం చేయాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు. కమిషనర్ వెంట ఏఈ భార్గవి, ఎమినిటీస్ సెక్రటరీ రవి ఉన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


నంద్యాల నాగేంద్రను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నంద్యాల నాగేంద్రను పలువురు అభినందించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బషీర్ అహ్మద్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాసాని మహేష్ గౌడ్, పార్లమెంట్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ ప్రసాద్, తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పేరపోగు రాజు, భాస్కర్, నాగార్జున పూలమలలు వేసి, శాలువతో సత్కరించారు.

దివ్యాంగుల బాలల వసతి గృహం తనిఖీ


బాలల సంరక్షణాధికారిని విచారిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సి.క్యాంపులోని దివ్యాంగుల బాలల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మంగళవారం తనిఖీ చేశారు. గత వారంలో ఇద్దరు బాలలు కూరలో గుర్తు తెలియని మాత్రలు కలపడంతో కొంతమంది బాలలు అస్వస్థతకు గురైన విషయం విధితమే. ఈ సంఘ టనపై విచారించేందుకు ఆయన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని వంట శాలను, భోజన వసతుల గురించి బాలలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐ జే.మన్మథ విజయ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఉద్యోగి నాగరాజు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతతోనే నేర స్వభావం


ప్రసంగిస్తున్న డాక్టర్ రమేష్ కుమార్

కర్నూలు లీగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతలు కలిగి ఉన్న బాలలకు సకాలంలో చికిత్స అందించాలని, లేకుంటే వారిలో నేర స్వభావం పెరిగే ప్రమాదం ఉందని మానసిక వ్యాధి నిపుణుడు డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా స్థానిక బాలల పరిశీలన గృహంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల బాలలు కూడా మాదక ద్రవ్యాలు మద్య పానం వంటి వ్యసనాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి బాలలను వెంటనే గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని కోరారు. కార్యక్రమంలో పరిశీలన గృహం సూపరింటెండెంట్ హుశేన్ బాషా, మానసిక వైద్యుడు చైతన్య కుమార్ పాల్గొన్నారు.

అపార్‌ను త్వరితగతిన పూర్తి చేయండి

ఓర్వకల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంబంధించిన ఆధార్ తరహా అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్) ఐడీ జనరేషన్‌ను త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో ఓం కార్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులతో అపార్ ఐడీ జనరేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అపార్ జనరేషన్ నమోదులో వెనుక బడిన విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్ణీత గడువులోపు ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 14000 మంది విద్యార్థులకు ఐడీలు జనరేట్ కావాల్సి ఉండగా 9,500 మందికి జనరేట్ అయ్యాయని చెప్పారు.

మాతా శిశు మరణాలను తగ్గించాలి

కోడుమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలను తగ్గించాలని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారి డాక్టర్ ఉమా అన్నారు. స్థానిక పొదుపు భవనంలో మంగళవారం వైద్య అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలను పేర్లను త్వరగా నమోదు చేసుకొని వారికి సకాలంలో ఆరోగ్య సేవలు అందించడం వలన మతా శిశు మరణాలను తగించ వచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మదన్‌శేఖర్, ఎంపీడీవో రాముడు, వైద్య సిబ్బంది కమాల్ సాహెబ్, నరసప్ప పాల్గొన్నారు.

కర్నూలు రైల్వేస్టేషన్ పరిశీలన

కర్నూలు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌ను మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పరిశీలించారు. గతంలో స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట టీజీవి గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫౌంటెన్‌ను రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించారు. ఈనేపథ్యంలో మరొక ఫౌంటెన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనువైన స్థలాన్ని టీజీ వెంకటేష్ పరిశీలించారు. టీజీ వెంట రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నేజీరావు, ఇంజనీర్ శివ కుమార్, సీఐ శ్రీనాథ్‌రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా (11కెవీ) నగరంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం బి.రోడ్ సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్‌కోత ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పంటనష్ట పరిహారం ఇవ్వాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆస్పరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023 ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంగం జిల్లా కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. 1829 మంది రైతుల పేర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు వ్యవసాయ అధికారులు తప్పుగా పంపడంతో రైతుల అకౌంట్లో డబ్బు జమ కాలేదన్నారు. అధికారుల స్పందించి వివరాలను సరిగా నమోదు చేయాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి రామాంజినేయులు, రైతు సంఘం మండల నాయకులు, ఈరన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని సీపీఎం నాయకులు లక్ష్మన్నలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కార్యాలయానికి వచ్చిన పీడీ నాసరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పాండవగల్లు ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మను కొనసాగించాలని కోరారు.

అపార్ నమోదుపై అవగాహన కల్పించండి : ఆర్డీవో



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆర్డీవో భరత్‌నాయక్ అధ్యాపకులను కోరారు. మంగళవారం కార్యాలయంలో అపార్ నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఆధార్‌తోపాటు విద్యార్థుల సర్టిఫికెట్లలో ఒకే పుట్టినతేదీ ఉండాలని, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు భవిష్యత్‌లో అపార్ ద్వారానే అందుతాయన్నారు.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

పత్తికొండ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చందోలి రహదారిలో మంగళవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొని ముగ్గురికి గాయాలయ్యాయి. తుగ్గలి మండలం రాతన గ్రామానికి చెందిన దంపతులు ప్రసాద్, మమత బొందిరాళ్ల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగివస్తుండగా తండా నుంచి పెల్లిమాన్ తండాకు వెల్తున్న శివరాజ్ నాయక్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్, మమతకు తీవ్రగాయలుకాగా శివరాజ్ నాయక్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రసాద్, మమతను మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానాన్ని శుభ్రం చేశారు



శ్మశానాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్

మద్దికెర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పందుల కుంట సమీపాన గల హిందూ శ్మశానవాటికలోని డంప్ యార్డును పంచాయతీ అధికారులు ఎక్సవేటర్‌తో శుభ్రం చేయించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ఆఖరి మజిలీకి అవస్థలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో రహదారికి అడ్డంగా ఉన్నా చెత్తాచెదారాన్ని తొలగించారు. డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామన్నారు. ఉపాధి అధికారులతో మాట్లాడి ముళ్లకంప తొలగిస్తామన్నారు. సలహా దారులు బండారు ఆంజనేయులు, సభ్యులు ఎన్.లక్ష్మీనారాయణ ఉన్నారు.

రియల్ దందా



తుగ్గలి మండలం జి.ఎర్రగుడి వద్ద వేసిన ప్లాట్లు

తుగ్గలి మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా సాగుతోంది. వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ అనుమతి లేకుండానే ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలున్నాయి.

- తుగ్గలి మండలంలో జోరుగా అక్రమ లే అవుట్లు
- ల్యాండ్ కన్వర్షన్, అనుమతి లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న వినియోగదారులు, చోద్యం చూస్తున్న అధికారులు

తుగ్గలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రియల్ ఎస్టేట్ వాపారులు రెచ్చిపోతున్నారు. వ్యవసాయ భూములను ఎలాంటి అనుమతి లేకుండనే ప్లాట్లుగా మార్చి విక్రయిస్తు న్నారు. జి.ఎర్రగుడి, రాంపల్లి అడ్ రోడ్డు, తుగ్గలి, రాతన, పెండేకల్ ఆర్ఎస్, బొందిమడుగుల, ఎద్దులదొడ్డి తదితర ప్రాంతాల్లో దందా సాగుతోంది.

చోద్యం చూస్తున్న అధికారులు

రియల్టర్లు ఇలా అడ్డగోలుగా ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నా పంచాయతీ అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే గాని చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్లాట్లు కొంటే అంతే..

అనుమతులు లేకుండా ప్లాట్లు కొన్న వినియోగదారులు భవిష్యత్తులో ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. ఈ స్థలాల్లో ఇంటి నిర్మాణానికి పంచాయతీ అనుమతి లభించదు, రుణాలు కూడా అందవు. చట్టపరంగా ప్లాట్లపై ఎలాంటి హక్కులు ఉండవు. జిల్లా అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లను అరకట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతి తీసుకునే చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే..

వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా మార్చేందుకు ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. ఇందుకు ప్రభుత్వానికి నిబంధనల మేరకు చలానా కట్టాల్సి ఉంటుంది. అయితే రియల్ వ్యాపారులు ఇవేవీ పట్టించుకోకుండానే వ్యవసాయ భూముల్లోనే వెంచర్లు వేస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్ చేయకుంటే పంచాయతీ అనుమతి లభించదు. దీంతో ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది.

అనుమతి లేకుంటే రద్దు చేస్తాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లే అవుట్లు వేయాలి. పరిశీలించి వ్యాపారులకు నోటీసులు జారీచేస్తాం. అనుమతి తీసుకోకుంటే ఆ లే అవుట్లను రద్దు చేస్తాం.

- రమాదేవి, తహసీల్దార్, తుగ్గలి.

డీజీపీని కలిసిన శ్యాంబాబు



డీజీపీతో కేఈ శ్యాంబాబు, తిక్కారెడ్డి

పత్తికొండ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకా తిరుమలరావును పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో విజయవాడలో కార్యాలయంలో మాట్లాడారు.

చిన్నారులకు మందు పంపిణీ

ఆదోని టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంచే స్వర్ణ ప్రాసనం మందును ఈనెల 21వ తేదీన ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ 16సంవత్సరాల, వరకు చిన్నారులకు ఇదివరకు నాలుగు విడతల్లో అందించామన్నారు. అవసరమైన వారు ఫోన్ నంబర్ 9849578178లో సంప్రదించాలన్నారు.

అర్జీలు డిసెంబరు 31లోపు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

- కలెక్టర్ రంజిత్ బాషా
- ఆదోనిలో అధికారులతో సమీక్ష

ఆదోని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్ రీ సర్వే అర్జీలను డిసెంబరు 31లోపు పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోనిలో డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో 7,482 పిటిషన్లు ఉండగా, వీటిని ఎస్ఓపి ప్రకారం పరిష్కరించాలన్నారు.

తహసీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని, స్వయంగా వెళ్లి మ్యుటేషన్ కేసులను పరిష్కరించాలని, భూసేకరణను వేగవంతం చేయాలని చెప్పారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో పెండింగ్‌లో ఉన్న 9 రీ ఓపెన్ కేసులు, 4 సీఎంవో గ్రీవెన్స్ తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల కుల ధ్రువీకరణ వెంటనే పంపాలని సూచించారు.

విభిన్న శాఖల పురోగతిపై దృష్టి

నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ కింద రూ.10లక్షల విలువైన 2 గొర్రెల యూనిట్లను లబ్ధిదారులతో ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. క్రాప్ బుకింగ్ ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డుల ప్రగతి 81.51 శాతంగా ఉండగా, 100% లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పెండింగ్ పనులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దకడుబూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో సీసీ రోడ్లు, డ్రిప్ ఇరిగేషన్, ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. చెత్త సంపద తయారీ కేంద్రాలు, హార్టికల్చర్, గోకులం పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. పీఆర్ వన్ యాప్‌లో ట్యాంకుల క్లోరినేషన్, అపార్ కార్డు జనరేషన్ పై ప్రగతి సాధించాలని సూచించారు.

విద్య, వైద్య శాఖలపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని, వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆధార్‌లో తప్పులను సరి చేయడంలో తహసీల్దార్లు సహకరించాలన్నారు. గర్భిణుల నమోదులో వందశాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. జేసీ నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య, డీఆర్‌వో వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

రూ.14 కోట్లతో గాల్వోనియం షెడ్



మార్కెట్ అధికారులతో మాట్లాతుతున్న కలెక్టర్

ఆదోని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులు తడవకుండా రూ.14 కోట్లతో గాల్వోనియం షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డును తనిఖీ చేశారు. యార్డులో సమస్యల పరిష్కారానికి దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వేరుశనగ రైతు శేఖర్‌తో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పత్తి దిగుబడిని పరిశీలించారు. పత్తిని సీసీఐకి విక్రయిస్తే లాభం ఎక్కువగా వస్తుందని సూచించారు. జేసీ నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, యార్డ్ సెక్రెటరీ రామ్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిని తనిఖీ చేసి, రోగులకు వైద్య సేవలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఇప్పటికే 12మంది సిబ్బంది ఉన్నారని, అదనంగా 8 మంది స్టాఫ్ నర్సులను డిప్యూటేషన్ చేశామని తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌లో టేబుల్ అవసరముందని డీసీహెచ్ఎస్ కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పెచ్చులూడుతున్న గోడల మరమ్మతులకు నివేదిక రూపొందించాలని కలెక్టర్ డీసీహెచ్ ఎస్‌ను ఆదేశించారు. డీసీహెచ్ఎస్ మాధవి, సూపరింటెండెంట్ మాధవి లత పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆలూరు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

ఆలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పత్తికొండ ఆర్డీవో భారత్ నాయక్ వైద్యులకు సూచించారు. మంగళవారం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కొత్త భవనం నిర్మించి ఏడాది గడచినా ఇంతవరకు ఆరంభానికి నోచుకోవడం లేదని రోగులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అరంభం అయ్యేలా చూస్తామన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

సివిల్ సప్లై గోదాం తనిఖీ

ఆలూరు సివిల్ సప్లై గోదాంను ఆర్డీవో తనిఖీ చేశారు.. బియ్యం నిల్వల రికార్డులను పరిశీలించారు. ప్రతినెల 1వ తేది నాటికి స్కూల్, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలకు, రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేయాలన్నారు. తహసీల్దార్ గోవింద్‌సింగ్, డీటీ విజయ్ కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్‌వో రవికుమార్, మహేంద్ర పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సీఐ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సూర్య మోహన్‌రావు అన్నారు. మంగళవారం విద్యశ్రీ ఉన్నత పాఠశాలలో సైబర్ క్రైమ్, ట్రాఫిక్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులను గురువులను గౌరవించి మంచిగా చదువుకోవాలన్నారు కరస్పాండెంట్ నాగేంద్ర, జ్యోతి సీఐని సన్మానించారు.

అనాథ వృద్ధురాలి మృతి.. అంత్యక్రియలు



పాడె మోస్తున్న గ్రామస్థులు

పత్తికొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో బెంగాల్‌లో పుట్టి.. ఇక్కడకు వచ్చిన ఓ అనాథ మహిళను ఆ గ్రామస్థులు అక్కున చేర్చుకున్నారు. పెద్దహుల్తిలో అనాథ వృద్ధ మహిళ షమీరా అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. 8 ఏళ్ల క్రితం షమీరా పెద్ద హుల్తికి చేరుకుంది. ఆమె బెంగాలీ బాష గ్రామస్థులకు అర్థంగాక కొన్నాళ్ల ఇబ్బందిపడ్డారు. అయినా మూడు పూటల భోజనం పెట్టి గ్రామస్థులు చేరదీశారు. ఉండడానికి రేకుల షెడ్డును నిర్మించారు. ఇలా 8 ఏళ్ల పాటు గ్రామస్థులతో కలిసి జీవించింది. రెండు రోజులుగా అనారోగ్యానికి గురైన ఆ మహిళకు గ్రామస్థులు వైద్యం చేయించినప్పటికీ కోలుకోలేక మంగళవారం కన్నుమూసింది. సాంప్రదాయబద్ధంగా మేళతాళాలతో అంత్యక్రియలు గ్రామస్థులు జరిపించారు. వీఆర్వో రంగస్వామి, కార్యదర్శి హుశేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అఖండ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనాన్ని వడ్డించాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు అఖండ కోరారు. మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలల్లోనూ మధ్యాహ్నం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున, రసూల్, ఉల్లేష్, ఉమేష్ పాల్గొన్నారు.

ఎస్సీ కళాశాల హాస్టల్ నూతన భవనాన్ని నిర్మించాలి

పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న ఎస్సీ కళాశాల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుందని నూతన భవనాన్ని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం సోషల్ వెల్ఫేర్ జేడీ రంగ లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు భయాందోళకు గురవుతున్నారన్నారు. తాత్కాలికంగా వేరే భవనంలోకి మార్చాలని కోరారు.

ఆలూరు సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే

- అసెంబ్లీలో చర్చ

ఆలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంత సమస్యలపై ఆలూరుకు చెందిన గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజినేయులు మంగళవారం అసెంబ్లీలో చర్చించారు. వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో గిరిజన బాలికల హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో పక్క నియోజకవర్గానికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని విరమించాలన్నారు. అరికెర గురుకులంలో హెచ్ఈసీ, సీఐసీ గ్రూప్‌లకు విద్యార్థులు లేరనే కారణంలో ఆ గ్రూప్‌లు ఎత్తివేయాలని చూస్తున్నారని అలా జరిగితే విద్యార్థులు నష్టపోతారని యదావిధిగా రెండు గ్రూప్‌లు కొనసాగేలా చూడాలని ఆయన అసెంబ్లీలో చర్చించారు.

పురాతన నోట్ల ప్రదర్శన



కైరుప్పల పాఠశాలలో నాణేలను తిలకిస్తున్న విద్యార్థులు

ఆస్పరి , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైరుప్పల జెడ్పీ పాఠశాలలో ఆజాదిక అమృత మహోత్సవ నాణేలు, నోట్లను ఉపాధ్యాయుడు నాగేష్ బాబు మంగళవారం ప్రదర్శించారు. క్రీస్తు పూర్వం నుంచి నేటి 75సంవత్సరాల వరకు చలా మణిలో ఉన్న కరెన్సీ, నాణేలు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. చాళుక్యులు, చోళులు, మొగలలు తమ సామ్రాజ్యంలో వాడిన నాణ్యాలు, నోట్లను ప్రదర్శించారు. హెచ్ఎం అహ్మద్, ఏకాంబరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

న్యాయ సంస్థలను కర్నూలు నుంచి తరలించొద్దు



ఆదోనిలో మాట్లాడుతున్న న్యాయవాదులు

- ఆదోని, పత్తికొండ బార్ అసోసియేషన్లు

ఆదోని రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సి), ఏపీ లోకయుక్త కోర్టులను కర్నూలు నుంచి తరలించొద్దని ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.కె.సుందర్ సింగ్, ఉపాధ్యక్షుడు మొలగవల్లి జనార్థన్ డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ వీటిపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి, సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఈనెల 22వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. జనరల్ సెక్రటరీ సురేంద్ర, సెక్రటరీ మల్లికార్జున, ట్రెజరర్ లతీఫ్, కలందర్, సునీతారెడ్డి, విరుపాక్షిరెడ్డి, వై.ఆర్ మల్లికార్జున, శ్రీధర్‌రెడ్డి, రంగన్న, తాయన్న, రామాంజనేయులు, రామలింగ, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

పత్తికొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయ సంస్థలను కర్నూలు నుంచి తరలించడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగస్వామి మహేష్, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, సత్యనారా యణ, శేఖర్, సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. శ్రీభాగ్ ఒప్పందం మేరకు గత ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేసిన లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు వక్ఫ్ ట్రిబ్యునల్‌ను అమరావతికి తరలించలాన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం సబబు కాదన్నారు. గత ఎన్నికల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాట చేస్తామన్న హామీని సీఎం చంద్రబాబు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు రవికుమార్, సహాయ కార్యదర్శి వాసు, కోశాధికారి రాజశేఖర్, న్యాయవాదులు హుల్తన్న, నరసింహయ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణతో సంపదను సృష్టిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఈవోఆర్డీ సూర్యనారాయణ



దేవనకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణతో సంపదను సృష్టిస్తామని దేవనకొండ ఈవోఆర్డీ సూర్యనారాయణ అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలంలో చెత్తసం పద కేంద్రాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: 26 కేంద్రాలు మంజూరు కాగా, 25 కేంద్రాలు పూర్తయ్యాయి. మరొకటి నిర్మాణ దశలో ఉంది. తడి, పొడి చెత్తను వేరు చేస్తాం.

ప్రశ్న: గ్రామాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉంది?

జవాబు: రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నాం, క్లోరినేషన్ చేస్తున్నాం. ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రపరుస్తున్నాం.

ప్రశ్న: గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ ఎలా ఉంది?

జవాబు: మేజర్ గ్రామపంచాయతీలో ప్రతిరోజూ సిబ్బందితో పారిశుధ్య పనులు చేస్తున్నాం. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: స్వర్ణయాప్‌తో ప్రయోజనం ఏమిటి?

జవాబు: ఈ నెలాఖరులోగా పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ సమన్వయంతో పనిచేసి, స్వర్ణయాప్‌తో ప్రతి ఇంటిని ఆన్‌లైన్ ఎక్కించి పన్నులు వసూలు చేస్తారు. గ్రామాభివృద్ధికి అవకాశం ఉంది.

ప్రశ్న: అగస్టు 23న నిర్వహించిన గ్రామసభలలో ఎన్ని పనులు గుర్తించారు?

జవాబు: గ్రామాల్లో 20 నుంచి 30 వరకు సమస్యలు గుర్తించాం. పీఆర్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకులు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు
● భయాందోళనలో గ్రామీణులు

గోనెగండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దానితో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 28 ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు ఉన్నాయి. అందులో బైలుప్పల, తిప్పనూరు, బోదేపాడు, కన్నూరు, కులుమాల బీసీ కాలనీలోని ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరాయి. పంచాయతీల అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోవడంలేదు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బైలుప్పల గ్రామంలోని ట్యాంక్‌ను 30 ఏళ్ల క్రితం కట్టించారు. ఈ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పిల్లర్లు సైతం దెబ్బతిన్నాయి. నీటి ట్యాంక్ అడుగు భాగం సిమెంట్ పెచ్చులు లేచి ఇనుపకడ్డీలు తుప్పు పట్టాయి. పిల్లర్ సపోర్టర్స్ కూడా దెబ్బతిన్నాయి. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే తిప్పనూరు, బోదేపాడు గ్రామాల్లో ట్యాంకులు కూడా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు పంచాయతీ సిబ్బంది నిధులు కేటాయించాల్సి ఉంది. కన్నూరు గ్రామం లోని ఓహెచ్ఆర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దీంతో అధికారులు ట్యాంక్‌ను పూర్తిగా తొలగించాలని సూచించారు. పెద్దనేలటూరు గ్రామంలోని ట్యాంక్ ప్రమాద స్థాయికి చేరడంతో ట్యాంక్‌ను అధికారులే పడగొట్టారు. మండలంలోని మిగితా గ్రామాల్లో కూడా ట్యాంకులను మరమ్మతులు చేయించాలి. అధికారులు స్పందించి ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బీటలువారిన పిల్లర్


సిమెంట్ పెచ్చులు ఊడిపోయిన నీటి ట్యాంక్ అడుగుభాగం


శిథిలావస్థకు చేరిన బైలుప్పల ఓవర్‌హెడ్ ట్యాంక్

రాఘవేంద్రుని సన్నిధిలో జబర్దస్త్ హాస్యనటులు


శ్రీమఠంలో జబర్దస్త్ హాస్యనటులు

మంత్రాలయం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) జబర్దస్త్ హాస్యనటులు మంగళవారం గడ్డం నవీన్, చిట్టిబాబు, మహిళా పాత్రదారులు మోహన్, హరికృష్ణ, సినీ ఆర్కెస్ట్రా కన్వీనర్ గోనెండ్ల ఖాజా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. జబర్దస్త్ హాస్యనటులతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ప్రాణేష్, కంతం నరసింహ, శివ, శాంతయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యంపై ప్రత్యేక నిఘా


పట్టుబడిన కర్ణాటక మద్యం చూపుతున్న ఎక్సైజ్ సీఐ

కోసిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దకడుబూరు కోసిగి మండలాల్లో అక్రమ కర్ణాటక మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కడిదొడ్డి గ్రామ సమీపంలో రెండు వేర్వేరు చోట్ల అక్రమ కర్ణాటక మద్యం దాడుల్లో ఆదోనికి చెందిన బోయ హనుమేష్, బోయ పద్మావతి వద్ద నుంచి 185 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తుంగభద్ర నది తీరాన అక్రమ కర్ణాటక మద్యంపై నిఘా ఏర్పాట చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కార్తిక్ సాగర్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ మునిరంగడు, భరత్, రవికుమార్, జనార్దన్ రావు తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే కురువల అభివృద్ధి

గోనెగండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే కురువల అభివృద్ధి సాధ్యమని కురువ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. మంగళవారం గోనెగండ్లలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పార్టీ కూడా కురువలకు ఇవ్వని ప్రాధాన్యం సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చాడన్నారు. కురువ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు ఇచ్చేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. కర్నూలు జిల్లాలో వెనుకబడిన కురవలకు అభివృద్ధి కోసం ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మహిళలు

మంత్రాలయం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ అన్ని రంగాల్లో రాణించగలిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని గ్రంథాలయ అధికారి జే వసంతలక్ష్మి అన్నారు. మంగళవారం మంత్రాలయంలో 57వ జాతీయ వారోత్స వాల సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో లక్ష్మి, నరసమ్మ, గాయత్రి, రేణుక, రేవతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, లైబ్రరీయన్ శివరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ సర్పంచ్ పూలచింత గడ్డం బజారి, నాయకుల లక్ష్మన్న, సీపీఐ నాయకులు పంపన్నగౌడు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

మార్చి చివరిలోగా ఎల్లెల్సీ సాగునీరు

గోనెగండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ నీరు గోనెగండ్ల సెక్షన్‌కు వచ్చే ఏడాది మార్చి చివరిలోగా విడుదల కానుందని గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీ ఏఈ ఉదయ్ భాస్కర్ తెలిపారు. గోనెగండ్ల సెక్షన్‌లో తుంగభద్ర దిగువ కాలువ కింద 7900 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, 7200 ఎకరాల వరకు సాగు కావచ్చున్నారు. నీరు మార్చి చివరి వరకు విడుదల అవుతుందని అధికారులు ప్రకటించడంతో ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఈ ఏడాది ఎల్లెల్సీ కింద వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేసుకోవాలని కోరారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

● అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే బీవీ
● పట్టు మగ్గాలపై సబ్సిడీ, రుణాలు, వర్క్‌షెడ్ల ఏర్పాటుపై ప్రస్తావన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గళం విప్పారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టుసబ్సిడీ పేరుతో రూ.600నుంచి రూ. 1000కు పెంచి చేనేతలకు ఇచ్చేదన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రంగులు మార్చినట్లుగా పథకాన్ని మార్చి నేతన్ననేస్తం పేరుతో డ్రామాలు మొదలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం పట్టు మగ్గాలుపై చేనేతలకు సిల్క్ సబ్సిడీ పునరుద్ధరిస్తుందా అని ప్రశ్నించారు. అలాగే చేనేత కార్మికులకు బ్యాంకు లింకేజీ లేకుండా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఏమనా ఇస్తారా? అని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే చేనేత కార్మికులు పనులు చేసుకునేందుకు వర్క్‌షెడ్ల ఏర్పాటుకు నిధులు పెంచి ఇచ్చే యోచనలో ఏమైనా ఉందా అని ప్రస్తావించారు. ఇందుకు స్పందించిన బీసీ సంక్షేమం, చేనేత శాఖ మంత్రి సవిత చేనేతలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాగా చేనేతల సమస్యలపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంపై ఎమ్మిగనూరు చేనేత కార్మికులు, సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రమాదకరంగా జీడీపీ కాలువ గట్లు

రక్షణ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదాలు

గోనెగండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల మలుపుల దగ్గర ప్రహరీ నిర్మించకపోవడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇదే దారి వెంట పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదన్నె, ఎర్రబాడు, పత్తికొండ, ఈదులదేవర బండ, బీ. సెంటర్, బండగట్టు గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి పూట ఈ రహదారిలో ప్రయాణించాలంటే ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. కాలువల మలుపుల దగ్గర రక్షణ గోడలు లేకపోవడం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇటీవల పలు వాహనదారులు అదుపుతప్పి కింద పడటంతో గాయాల పాలైన సంఘటనలున్నాయి. సోమవారం ఉదయం కోడుమూరు నుంచి పత్తికొండకు వెళ్లే కారు బురద కారణంగా అదుపు తప్పింది. అదృష్టవశాత్తు కాలువ గట్టు దగ్గర నిలిచిపోయింది. లేక పోతే కాలువలో కారు పడే ప్రమాదం జరిగేది. అధికారులు స్పందించి కుడి,ఎడమ కాలువలకు రక్షణ గోడలు కట్టించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


జీడీపీ కుడి కాలువ దగ్గర ప్రమాదకరంగా మారిన రహదారి

బెల్టు వ్యాపారులపై పోలీసుల దాడులు

నందవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నందవరం మండలంలో ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి టీం, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు మంగళవారం రాత్రి మెరుపు దాడులు చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో బెల్టు వ్యాపారుల దందా.. అనే కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. మండలంలోని గంగవరంలో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, కనకవీడులో సీఐ రమేష్‌రెడ్డి టీంలు దాడులు చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టు షాపుల నిర్వాహకులను పట్టుకున్నారు. మరి కొంత మందిపై దాడులు చేసేది ఉందని, పూర్తి వివరాలు కేసు నమోదు అయిన తర్వాత వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం కార్తీక బహుళ చవితిని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

27నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభలు

కౌతాళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభలను 27 నుంచి 30 వరకు విజయనగంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ తెలిపారు. మంగళవారం కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర సభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సాయి వర్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

ఎమ్మిగనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని మాచాని సోమప్ప జడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శారద, వెంకటేశ్వరమ్మ, విజయలలిత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శాఖగ్రంథాలయంలో ఇన్‌చార్జి హరికృష్ణ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కౌతాళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు జగన్న కాలనీలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎరిగేరి గ్రామంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసి అందులో ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే నిధులను అప్పనంగా దోచేశాడని ఆరోపించారు. ఇళ్లు నిర్మిస్తానని అధిక మొత్తంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు దోచుకున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరన్న, వీరేష్ ఉన్నారు.

షాదీఖానాలు నిర్మించాలి

మంత్రాలయం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో షాదీఖానాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కోరారు. మంగళవారం మంగళగిరిలో మైనార్టీ సంక్షేమ మంత్రి ఎండీ ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఉరుకుంద ఆలయంలో రుద్రహోమం

కౌతాళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో మంగళవారం రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి, శివన్న స్వామి, పూజన్న స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి


జెండాను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దకడబూరులోని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తిక్కన్న అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలను అరికట్టి ఉపాధి పనులు కల్పించాలన్నారు. 200రోజులు ఉపాధి పనులు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీ పని ప్రదేశంలో మరణిస్తే రూ 10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీరశేఖర్, నారాయణ, లింగన్న, పరమేష్, రామాంజినేయులు, బాలకృష్ణ, శ్రీనివాసులు,హనుమంతు పాల్గొన్నారు.

నాటుసారా తయారీకి బెల్లం విక్రయిస్తే చర్యలు


కిరాణం వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి కేంద్రంతో పాటు గ్రామాల్లో నాటుసారా తయారీకి కిరాణం వ్యాపారులు బెల్లం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోసిగిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కిరాణం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా అధిక మొత్తంలో ఐదు కేజీలకు మించి అధిక మొత్తంలో బెల్లంను కొనుగోలు చేస్తే వారి వివరాలు తమకు తెలియజేయాలన్నారు. లైసెన్సులు లేకుండా బెల్లం విక్రయిస్తే వ్యాపారులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. కోసిగి చెందిన లారీ డ్రైవర్లు కొందరు అక్రమంగా బెల్లం తరలిస్తున్నారన్న సమాచారం ఉందని, వారిపై నిఘా ఉంచామన్నారు. బెల్లం కొనుగోలు చేసిన వారికి రశీదులు ఇవ్వాలన్నారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మంత్రాలయం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మంత్రాలయం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హంపయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది ఇటీవల కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి క్యారమ్స్, బీచ్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విఠోభ రావు, రామన్న, బసవరాజు, శివశంకర్‌లు ఉన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు ఏర్పాటు చేయాలి

మంత్రికి ఎమ్మెల్యే బీవీ, న్యాయవాదుల వినతి


న్యాయశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ, న్యాయవాదులు

ఎమ్మిగనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. మంగళవారం అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు లక్ష్మీనారాయణ రెడ్డి, గురురాజరావు, రామకృష్ణ నాయుడు, నర్సిరెడ్డి, సామెల్, రషీద్, ఏసేపులు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను మంత్రికి ఎమ్మెల్యే బీవీ వివరించారు. ఎమ్మిగనూరులో వీలైనంత త్వరగా కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

మంత్రాలయం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టి ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రస్తుత అధికార పార్టీ ప్రభుత్వం కూడా పల్లె ప్రజలకు మూడు సెంట్ల స్థలం పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని తెలిపి నేటికీ ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదని తెలిపారు. ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మన్న నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీరేష్, రాజు, ఈరన్న, నరసింహులు, సుంకన్న, జ్యోతి ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధం

జంపాపురంలో తప్పిన పెను ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోసిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం గ్రామంలో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన రైతు గౌళ్ల హేమంత్ రెడ్డి వరిగడ్డి, చిన్నబోంపల్లి గ్రామానికి చెందిన మాధవరం చెన్నారెడ్డి ట్రాక్టర్లలో ఎమ్మిగనూరు నుంచి జంపాపురం తీసుకువస్తుండగా.. వైర్లు కిందికి ఉండటంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాక్టరుపై ఉన్న గడ్డికి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన డ్రైవర్ గడ్డిని కిందకు పడేయడంతో ప్రమాదమే తప్పింది. వెంటనే ఎమ్మిగనూరు ఫైరింజన్ అధికారులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.